# సమ ఉజ్జీలు

## వసుంధర

"పిలిచారా బాస్!" అనడిగింది చంచల.

ఆమె సన్నని నడుంతో తీర్చిదిద్దిన పొందికలతో, ఎంతో అందంగా నాజూగ్గా కనబడుతోంది. ఆమె చీర కట్టిన తీరు అందానికి మెరుగులు దిద్దింది.

బాస్ ఆమెవంక ఎగదిగా చూసి—"నువ్వు మా సంస్థకు చాలా సేవ చేశావు. ప్రమోషన్ నీ కిష్టమేనా?" అనడిగాడు.

చంచల ముక్తసరిగా అదోలా నవ్వింది.

సంస్థకు తాను చేసిన సేవలేమిటో ఆమెకు బాగా తెలుసు.

సంస్థ ప్రయోజనాలు సాధించడానికి ప్రముఖ వ్యక్తులపై ప్రయోగించబడేదామె. తన అందంతో వారి నాకర్షించుకొని, ఆకర్షణతో సమ్మోహితుల్ని చేసి—ప్రముఖుల్ని తనకు బానిసలను చేసుకొని సంస్థ కెన్నో ప్రయోజనాలు సాధించింది. ఒకో ప్రయోజనం సాధించి

నప్పుడల్లా వేల రూపాయల్లో ఆమెకు బోనస్ ముట్టేది— జీతం కాక!

నాలుగు సంవత్సరాలలో సాధారణ మధ్య తరగతి స్థాయి నుంచి ఉన్నత మధ్య తరగతి స్థాయి కెదిగిం దామె.

ఇప్పుడామె పేరున యాభై వేల రూపాయలున్నాయి. స్వంతంగా చిన్న యిల్లు కూడా ఉంది.

ఈ నాలుగు సంవత్సరాలలో మా తల్లిదండ్రులను కూడా కొంత ఆదుకొం దామె.

"ప్రమోషన్ నీ కిష్టమే కదూ!" అన్నాడు బాస్ మళ్ళీ.

"ప్రమోషన్‌తో డ్యూటీ మారుతుందా....?" అందామె.

"మారుతుంది—" అన్నాడు బాస్.

చంచల కళ్ళు మెరిశాయి.

ఉద్యోగం చంచలకు అవసరం. తప్పనిసరి పరిస్థితుల్లో ఆమె ఈ ఉద్యోగంలో చేరింది. ఉద్యోగం చేసి గౌరవంగా డబ్బు సంపాదించుకోవచ్చునని ఆమె అనుకొంటే— ఉద్యోగమిచ్చిన సంస్థకామె ఆడతనమే అవసరమయింది. తప్పనుకుంటూనే గతిలేక ఒప్పుకుంది. మొదట్లో మనసు సంకటపడింది. తర్వాత క్రమంగా అలవాటయింది. అలవాటయినా తన పద్ధతు లామెకు నచ్చలేదు. పెళ్ళి చేసుకుని జీవితంలో స్థిరపడాలని ఆమె కోరిక.

కానీ సంస్థలో ఆమె పదేళ్ళకు కంట్రాక్టు రాసింది. సంస్థ ఒప్పుకు నేదాకా పెళ్ళి ఆమెకు నిషిద్ధం.

"నువ్వు సంస్థలో కంట్రాక్టులో వున్నావు. కానీ ఈ

నాలుగేళ్ళలో నీవు చేసిన సేవకు ప్రతిఫలంగా సంస్థ నీ కంట్రాక్టు రద్దుచేసి నీకు స్వేచ్ఛ నివ్వగలదు. ప్రమోషన్ అవసరం లేదనుకుంటే నీవు ఉద్యోగం వదలి వెళ్ళిపోవచ్చు కూడా!" అన్నాడు బాస్.

"ప్రమోషన్ అవసరంలేదని నేననలేదు—" అంది చంచల.

"అన్నావని నేనూ అనలేదు...." అని నవ్వాడు బాస్—"ప్రమోషన్ను అంగీకరిస్తే—నీ విక కంట్రాక్టులో ఉండవు. వివాహం కూడా చేసుకోవచ్చు...."

చంచల కళ్ళు మళ్ళీ మెరిశాయి.

"థాంక్యూ బాస్!" అంది చంచల.

"ప్రమోషన్లో నీ డ్యూటీ తెలుసా?"

"చెప్పండి—" అందామె.

"శ్రీమతి లహరి తెలుసుకదా నీకు...."

లహరి చంచలకు తెలుసు.

ఉద్యోగంలో చేరిన నెలరోజుల తర్వాత శిక్షణ నిమిత్తం చంచల లహరికి అప్పగించబడింది. మగవాళ్ళ నే విధంగా ఆకర్షించాలో, చుట్టూ తిప్పుకోవాలో, ఆకట్టుకుని పనులెలా సాధించాలో లహరి ఆమెకు నేర్పింది. అందుకని ఆమె స్త్రీ పురుషులకు సంబంధించిన రహస్యాలెన్నో చంచలకు చెప్పింది. జీవితంలో అటువంటి పాఠాలు మరో స్త్రీ ద్వారా నేర్చుకుంటానని చంచల అనుకోలేదు.

"తెలుసు—" అంది చంచల.

"లహరి రాజీనామా యిచ్చింది. ఆమె డ్యూటీ నీవు తీసుకోవాలి..."

తెల్లబోయింది చంచల.

ప్రమోషనంటే యిదా — అనుకుందామె.

శ్రీమతి లహరి స్థానంలో తన్నూహించుకోగానే ఆమెకేదోలా అనిపించింది. చంచల అభిప్రాయంలో తప్పు చేయడం కంటె — తప్పుచేసే విధానం శిక్షణగా యివ్వడం సిగ్గుచేటు పని!

లహరి అంటే ఆమె మనసులో నీచమైన భావముందేది.

"ప్రమోషనంటే నీ కిష్టమే కదూ!" అన్నాడు బాస్.

ఏమనాలో తెలియలేదు చంచలకు.

బాస్ ఆమె ముందుకో ఫైలు తోశాడు.

"ఇష్టమైతే రేపట్నుంచే నీ డ్యూటీ ప్రారంభం. ఇందులో నలుగురు యువతుల ఫోటోలు, వివరాలు ఉన్నాయి. కాబోయే నీ శిష్యురాండ్రు వారు. చదువుకో నీ అభిప్రాయం చెప్పు. అక్కడ అలా సోఫా మీద కూర్చుని నీ సమయం నీవు తీసుకో. ఈలోగా నేను నా పని నేను చూసుకుంటాను...." అన్నాడు బాస్.

చంచల మాట్లాడకుండా ఫైలందుకొంది. వెళ్ళి సోఫాలో కూర్చుంది. ఫైలు తెరిచింది.

మొదటి పేజీలోని యువతి మార్గరెట్.

ఫోటో చూస్తూనే ఉలిక్కిపడింది చంచల.

మార్గరెట్ ఆమెకు బాగా తెలుసు.

సరిగ్గా నాలుగిళ్ళకు పక్కగా ఉంటుందామె యిల్లు చంచలింటికి!

ఆమె చంచలను — అక్కా — అని పిలుస్తుంది. తరచుగా చంచల యింటికొచ్చి ఎన్నో విశేషాలడిగి తెలుసుకుని వెడుతుంది.

చంచల అంటే ఆమెకు ఆరాధన!

నాలుగురోజుల క్రితమామె చెప్పింది తన కుద్యోగం వచ్చిందని!

ఉద్యోగం తన సంస్థలో కాదు.

చంచల ఫైలు మూసి—బాస్ దగ్గరకు వెళ్ళి—"అందులో మన సంస్థకు సంబంధించని ఉద్యోగు లున్నారు—" అంది.

బాస్ నవ్వి—"స్టేట్ బ్యాంకు ఉద్యోగులకి స్టేటు బ్యాంకే శిక్షణ నివ్వనవసరంలేదు. బ్యాంకుద్యోగులందరికీ శిక్షణ నివ్వడానికో సంస్థ ఉంది...." అన్నాడు.

"అంటే?"

"మేమందరం ఒకే గూటి పక్షులం. కొన్ని మాకు అనుబంధ సంస్థలు కొన్ని మాపై ఆధారపడ్డ సంస్థలు. మాకు సెంట్రలైజ్డ్ ఫెసిలిటీస్ ఉన్నాయి...."

చంచల యేదో అనబోగా—"అప్పుడే ఫైలంతా చూసేశావా?" అన్నాడు బాస్.

"లేదు. ఇంకా మొదటి పేజీలో ఉన్నాను—" అంది చంచల.

"మొత్తం పేజీలన్నీ చూసి అప్పుడు నీ అభిప్రాయం చెప్పు...."

చంచల మాట్లాడకుండా వెళ్ళి మళ్ళీ సోఫాలో కూర్చుంది.

ఉద్యోగంలో చేరాక ఆమెకు సహనం, నెమ్మదితనం అలవడ్డాయి.

మరోసారి ఫైలు తెరిచింది.

రెండో పేజీలో—

మరింత ఉలిక్కిపడింది చంచల.

అందులో సుభద్ర ఉంది.

సుభద్ర స్వయానా చంచల చెల్లెలు.

చంచల తలిదండ్రులకు ముగ్గురు పిల్లలు.

పెద్దవాడు గోపాల్ బాగా చదువుకుని మంచి ఉద్యోగం సంపాదించాడు. బొంబాయిలో పెద్ద కంపెనీలో ఉద్యోగం. నెలకు నాలుగైదు వేలొస్తుంది. ఉద్యోగానికి ముందే అతడికి పెళ్ళయింది. ఉద్యోగం వచ్చేదాకా ఆ తమామల కనిగిమినిగి ఉండేది చంచల వదిన లత. ఉద్యోగం రాగానే ఆమెకు భయం పట్టుకుంది, అత్తమామలు కూతుళ్ళ పెళ్ళి పేరిట తన్ను దోచేస్తారేమోనని! ఆమె అందం కంటే స్వార్థమే ఎక్కువగా ఆకర్షించడంతో—గోపాల్ లతకు బానిసయ్యాడు.

ఆ సమయంలో తండ్రికి జబ్బు చేసింది. ఆయన ఉద్యోగం ఊడింది.

చంచల గోపాల్ కంటె పదేళ్ళు చిన్నది. సుభద్ర చంచల కంటె నాలుగేళ్ళు చిన్నది.

అన్నగారి నుంచి ఏ సాయమూ అందక—వదిన పరుషంగా మాట్లాడిందని అలిగి—పౌరుషంతో ప్రయత్నాలు చేసి ఉద్యోగం సంపాదించింది చంచల. రెండేళ్లలోనే కుటుంబ పరిస్థితులు చక్కబడ్డాయి.

ఇంటి పరిస్థితుల నెప్పటికప్పుడు తెలుసుకుంటూనే ఉంది లత. అక్కడ పరిస్థితులు చక్కబడ్డాయనగానే ఆమె అత్తమామల్ని కాకా పట్టసాగింది.

“చంచల దగ్గర డబ్బు చేరింది. తన పెళ్ళి తనే చేసుకోగలదు. పెళ్ళయ్యాక ఆడపిల్లింట్లో ఉండలేరు మీరు. ఎప్పటికయినా కొడుకే విధాయకం. మా ఇంట్లో

ఉండడం మీ వాళ్ళ. వచ్చి మాతో ఉండండి—"
అందామె.

అందుకు కారణ ముంది.

లత కూడా కొత్తగా ఉద్యోగంలో చేరింది. ఇంట్లో మనుషుల అవసరం.

బయటివారికయితే జీత మిచ్చుకోవాలి. నమ్మక ముండదు.

అత్తమామలైతే నమ్మకంగా ఉంటారు. చాకిరీ చేస్తారు. వారికేమిచ్చినా అది తమ బాధ్యతే అవుతుంది. అంతా మెచ్చుకుంటారు.

లత అత్తమామల్ని బాగా చూసుకునేది.

అత్తమామ లామెదగ్గరే ఉండేవారు. కూతురి పెళ్ళి గురించి తరచుగా ఆలోచిస్తూండేవారు. ఆమె వారికి నచ్చచెబుతూండేది.

సుభద్ర అక్క దగ్గరే ఉంటోంది.

అక్కంటే ఆమెకు ఆరాధన!

"అక్కా! నీకులాగే నేనూ ఉద్యోగంలో ప్రవేశించి నా కాళ్ళమీద నేను నిలబడతాను. అమ్మనూ, నాన్ననూ ఆదుకుంటాను—" అనేది సుభద్ర.

"వద్దమ్మా! నాకు తప్పనిసరై ఉద్యోగంలో చేరాను. నీకా కర్మ పట్టలేదు. నీ పెళ్ళి నేను చేస్తాను. నాకంటే ముందు నీ పెళ్ళి జరుగుతుంది—" అనేది చంచల.

సుభద్ర మాట్లాడేది కాదు. కాని ఆమె ఉద్యోగానికి అప్లై చేసింది. నాలుగు నెలల క్రితం ఉద్యోగంలో చేరింది.

"కంట్రాక్టు రాయకు—" అని సలహా యిచ్చింది చంచల.

"కంట్రాక్టేమీ లేదు—....." అంది సుభద్ర.

ఉద్యోగంలో ఆమె డ్యూటీ లేమిటో గుచ్చి గుచ్చి అడుగుతూం దేది చంచల. సుభద్ర సమాధానా లామెకు తృప్తికరంగానే ఉండేవి. కానీ మనసులో ఏదో భయం....

ఇప్పుడు ఫైల్లో సుభద్ర ఫోటో!

చంచల ఫైలు మూసేసింది.

సుభద్రకు తను శిక్షణివ్వాలి—పురుషుల్నెలా ఆకర్షించుకోవాలో! ఎలా ఆకట్టుకోవాలో!! వారినెలా తమకు బానిసల్ని చేసుకోవాలో!!!

ఏ అక్కా కోరుకోని శిక్ష యిది!

ఏ అక్కకైనా శిక్ష యిది!

చంచల లేచి బాస్ దగ్గరకు వెళ్ళి "బాస్! నాకు ప్రమోషన్ వద్దు—" అంది.

బాస్ చూస్తూన్న ఫైలుని మూసి—"ఏం—పాత డ్యూటీలే బాగున్నాయా?" అన్నాడు.

చంచల జవాబివ్వలేదు.

"అయాం సారీ చంచలా! ప్రమోషన్ ఒప్పుకోకపోతే—నీకీ ఉద్యోగం మరో నాలుగు మాసాలు మాత్రమే ఉంటుంది...." అన్నాడు బాస్.

"ఎందుకని?"

"అది సంస్థ నియమావళి!"

చంచల ఆలోచించకుండా—"నేనిక్కడ ఉద్యోగం కొనసాగించగలను. కానీ ప్రమోషన్ వద్దు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ ప్రమోషన్ అంగీకరించలేను—" అంది.

"అందుకొకే ఒక్క ఉపాయ ముంది. శ్రీమతి లహరి ఈ ఉద్యోగానికి రాజీనామా చేసింది. ఆమెను మరి

కొంత కాలం ఉద్యోగంలో కొనసాగించడానికి ఒప్పించు....."

"అది నావల్ల నవుతుందా?"

"నీవల్లనైనా కాకపోయినా అది నీ కవసరం...."

చంచల ఆలోచనలో పడింది.

"నీతో మాట్లాడ్డానికి నా కెక్కువ సమయం లేదు. నువ్వు అర్జంటుగా వెళ్ళి శ్రీమతి అహారిని కలుసుకో. రేపటికల్లా నా కీ విషయం చెప్పాలి. ఇప్పుడు శ్రీమతి అహారి ఇంట్లో ఒంటరిగా ఉంటుంది. నీవు బయటకు వెళ్ళ డానికి అనుమతిస్తాను. వెళ్ళి కలుసుకోరాదూ?" అన్నాడు బాస్.

చంచల బాస్ వంక చూసింది.

అతడి కళ్ళలో విసుగు కనబడుతోంది.

చంచల జాప్యం చేయకుండా అక్కణ్ణించి కదిలింది.

## 2

"నేను రాజీనామా చేయలేదు. ఉద్యోగం నుంచి నా కుద్వాసన జరిగింది—" అంది అహారి.

చంచల ఆశ్చర్యపడి — "మరి బాస్ అలా చెప్పాడేం?" అంది.

"వాళ్ళ భాష అలాగే ఉంటుంది...." అంది అహారి నిట్టూర్చి.

"మీ ఉద్యోగం మీకు నచ్చిందా? ఇందులో కొన సాగడం మీ కిష్టమేనా?"

"ఇలాంటి ఉద్యోగం మనబోటివాళ్ళకు నచ్చదు. కానీ తప్పదు కదా! నేను నా భర్త కెన్నోసార్లు నచ్చ జెప్పాను. ఆయన నా కంటే ఎక్కువగా నా ఉద్యో

గాన్ని ప్రేమిస్తున్నాడు. భార్యాభర్త లిద్దరూ కలసి సంపాదించి బాగుపడాలనే సిద్ధాంత మాయనది! ఇప్పుడీ ఉద్యోగం పోతే—మరో ఉద్యోగం దొరికేదాకా—ఇంట్లో శాంతి ఉండదు—...."

చంచల కామెను చూస్తూంటే జాలివేసింది—"మిమ్మల్ని చూస్తూంటే నేను పెళ్ళికి ముందే ఈ ఉద్యోగాన్ని వదలిపెట్టడం మంచిదనిపిస్తోంది...." అందామె.

"మర్యాదగా వదిలిపెట్టడం మంచిది. వాళ్ళే నీ కెలాగూ ఉద్వాసన పలుకుతారు—...."

చంచల ఆశ్చర్యంగా—"నేను వద్దన్నప్పుడు కదా—వాళ్ళు పొమ్మనేది...." అనడిగింది.

"వాళ్ళ భాష నీకు తెలియదు...."

"వాళ్ల భాషంటే?" అంది చంచల.

"ఉదాహరణకు వాళ్ళు నిన్ను నా దగ్గరకు పంపింది-నా రాజీనామా ఆపడానికి కాదు. నిన్ను రాజీనామాకు ప్రోత్సహించడానికి!"

చంచల ఆశ్చర్యంగా—"నేను నమ్మలేను...." అంది.

"నేను చాలా ఏళ్ళుగా ఈ ఉద్యోగంలో ఉన్నాను. సంస్థకు పనికివచ్చే విధంగా నే నెందరో యువతులను తయారుచేశాను. అయితే సంస్థకు పనికివచ్చే వ్యక్తులు నా కంటే ఎక్కువ కాలంగా—అదే హోదాల్లో ఉన్నారు. వారికి పదవులు మారుతూండాలి. అందుకే శిక్షణ నిచ్చే వారు కొత్త కొత్త పదవులు నేర్పుతూండాలి .... నా దగ్గర భావాల కొరత ఏర్పడినట్లు సంస్థ భావించి నా స్థానంలో మరొకర్ని నియమించదల్చుకున్నారు. నన్ను రాజీనామా ఇవ్వమన్నారు. అలాగేనూ నీ విషయం

లోనూ...."

"నా విషయంలో రాజీనామా యివ్వమని అడగ లేదుగా...."

"చెప్పానుగా—వాళ్ళ భావ వేరే ఉంటుందని.... బహుశా నాలుగు నెలల్లో నీకు ఇరవై రెండు నిండుతాయి. అవునా?"

చంచల ఓ క్షణం ఆలోచించి ఆశ్చర్యంగా—"అవును. మీకెలా గుర్తుంది?" అంది.

"సంస్థలో నీవంటి యువతికి వయోపరిమితి ఇరవై రెండేళ్ళు. అది సంస్థ నియమావళి—" అంది లహరి.

అంటే తన్ను నాలుగు నెలల తర్వాత ఉద్యోగం వదులుకోమని చెప్పడానికి కారణమిదన్న మాట—అనుకుంది చంచల.

"నీ ఉద్యోగం నాలుగు నెల్ల తర్వాత పోతుంది. కంట్రాక్టులో ఉన్నావు కాబట్టి నిన్నూరికే పొమ్మనడం వారి కిష్టంలేదు. అందుకే నా ఉద్యోగం నీ కాఫర్ చేశారు. అందులో నీవు కొనసాగడం వారి కిష్టమైతే—బాస్ నీకిచ్చే ఫైల్లో వేరే ఫోటోలుండేవి. ఏ ఫోటోలు చూపితే నీవీ ఉద్యోగాని కొప్పుకోవో ఆ ఫోటోలు నీకు చూపించారు...."

చంచల ఆశ్చర్యంగా—"ఇదంతా ఒక పథకం ప్రకారం చేస్తున్న పనా?" అంది.

"అఫ్కోర్స్! మార్గరెట్, సుభద్రల ఫోటోలు—ఆ ఫైల్లోకి కాకతాళీయంగా వచ్చేయనుకుంటున్నావా?" అంది లహరి.

చంచల నిట్టూర్చి—"అయితే నేను ప్రమోషన్ కొప్పేసుకుంటాను. ఏం జరుగుతుందో చూస్తాను...."

అంది.

"చూడానికేం లేదు. వాళ్ళు సర్వసమర్థులు. మార్గరెట్‌నీ, సుభద్రనీ—నీకు శిష్యురాండ్రను చేయగలరు. సర్వంసిద్ధపడి ఉన్నావా?" అంది లహరి.

చంచల తెల్లబోయింది.

"మిస్ చంచలా! సంస్థలో నీ డ్యూటీ చేయడం మినహా నీవు లోకజ్ఞానం అలవర్చుకోలేదనిపిస్తుంది నాకు. మార్గరెట్, సుభద్రలు చేస్తున్నది నీ లాంటి ఉద్యోగం కాదు. వారిని నీకులా మార్చగలమని వారు నిన్ను హెచ్చరిస్తున్నారు. మార్గరెట్, సుభద్రలతో నీకున్న అనుబంధం వారికి తెలుసు. వారి భవిష్యత్తు గురించి నీవీ ఉద్యోగాన్ని వదులుకోగలవని వారి నమ్మకం— ..." అంది లహరి.

చంచల ఆలోచిస్తూ—"నే నిప్పుడేం చేయాలి?" అంది.

"సంస్థకు నీపై ఆసక్తి లేదు. నా సలహా ఏమిటంటే నాలుగు నెలలలోగా నీవు వేరే ఉద్యోగమేదైనా చూసుకోవడం మంచిది—" అంది లహరి.

"ఎల్లకాలమూ ఉద్యోగమేనా? నాకు జీవితంలో స్థిరపడాలనుంది—" అంది చంచల స్వగతాన్ని బైటపెడుతూ.

"ఆడదానికి జీవితంలో స్థిరపడడమంటే పెళ్ళి—.... నీ ఉద్దేశ్యం కూడా అదేనా?"

"మీ సలహా ఏమిటి?"

"పెళ్ళి చేసుకో—" అంది లహరి.

"నాకు పెళ్ళి కాదు—" అంది చంచల.

"ఎందుకని?"

చంచల తనింటి పరిస్థితులు చెప్పి—"అమ్మా నాన్న లకు కదినంటే భయం, నా పెళ్ళి నేనే చేసుకుంటానని కదినంటే వాళ్ళు నమ్మతారు...." అంది.

"అవును—నీ పెళ్ళి నువ్వే చేసుకో!" అంది చంచల.

"ఎలా?"

లహరి చిరాగ్గా—"అందుకే కంపెనీ నీ వుద్యోగ మూడపీకాలనుకుంటోంది ..." అంది.

"అవును—....నా పెళ్ళి నేనే యెలా చేసుకుంటాను?"

"ఎలాగేమిటి? నేనిచ్చిన శిక్షణ ఎందుకు? నువ్వు సంస్థ ప్రయోజనాల కోసమే తప్ప—నీ ప్రయోజనానికి నా శిక్షణ నుపయోగించుకోలేవా?"

"అంటే?"

"ఓ మంచి కుర్రాడి నెన్నుకుని వల విసురు. అతణ్ణే పెళ్ళి చేసుకుని సుఖంగా జీవించు—" అంది లహరి.

"అరే—ఇలాంటి ఆలోచన నా కెప్పుడూ రాలేదే?" అంది చంచల.

"తమ శక్తి నితరుల కోసం ధారపోయాలనుకునే వారు సామాన్యులుగా మిగిలిపోతున్నారు. స్వప్రయోజనాల కోసం వాడుకునే స్వార్థపరులు నాయకులవుతున్నారు...." అంది లహరి బాధగా నిట్టూర్చి.

"మీ సలహాకు, సూచనకు, హెచ్చరికకు చాలా చాలా థాంక్స్—" అంటూ చంచల అక్కణ్ణించి లేచింది.

# 3

కృష్ణమోహన్ ట్రయిన్ లోంచీ ప్లాట్ ఫారంమీద దిగి చుట్టూ చూశాడు, ఓ క్షణం తటపటాయించి ముందుకు నడిచాడు. టికెట్టివ్వాల్సిన చోటకు వచ్చేసరికి ఓ వ్యక్తి అతడికి ఎదురై—"సార్—వచ్చేశారా?" అన్నాడు.

కృష్ణమోహన్ అతడివంక చూసి—"నువ్వా—సీతాపతి—నా ఉత్తరం అందిందా—కులాసాగా వున్నావా?" అన్నాడు.

"ఉత్తరమందింది—ఏమిటి విశేషం సార్! మీ కూడా సామానేం—లేదే" అన్నాడు సీతాపతి.

"ముందు మనింటికి పోదాం—" అన్నాడు కృష్ణమోహన్.

ఇద్దరూ టికెట్ గేట్లోంచి బైటకు వచ్చారు. కృష్ణమోహన్ ట్రయిన్ టికెట్టిచ్చాడు సీతాపతి ప్లాట్ ఫారం టికెట్టిచ్చాడు.

బయట కారు సిద్ధంగానే వుంది. డ్రైవర్ డోర్ తెరవగానే యిద్దరూ బ్యాక్ సీట్లో కూర్చున్నారు.

"విశేషాలేమిటి సార్ ...." అన్నాడు సీతాపతి.

"ఇంట్లో మాట్లాడుకుందాం—" అన్నాడు కృష్ణమోహన్.

ఇద్దరూ యిల్లు చేరుకున్నారు.

చిన్న బంగళా అది.

కృష్ణమోహన్ అందులో ప్రవేశించి ఓ గదిలోకి వెళ్ళాడు. హోటల్ రూంలా సకల సదుపాయాలూ ఉన్నాయందులో.

అతడు త్వరగా బట్టలు మార్చుకుని స్నానం చేసి

లుంగీ, బనియన్‌లు ధరించాడు. ఆ సరికి టిఫిన్ తీసుకుని వచ్చాడు సీతాపతి.

ప్లేట్‌లో వేడి వేడి ఇడ్లీలు, కారప్పొడి, చట్నీ....

"పనివాళ్ళు లేరా?" అన్నాడు కృష్ణమోహన్.

"మీకు సంబంధించినంత వరకూ నేనే పని వాణ్ని—...."

కృష్ణమోహన్ చిరునవ్వు నవ్వి—"హద్దులు మీరితే వినయం అతివినయ మనిపించుకుంటుంది. అతివినయం మంచివాళ్ళ లక్షణం కాదు...." అన్నాడు.

"మీరేమనుకున్నా నా లక్షణాలు మారవు. నా ప్రవర్తన నా మెతలను సరిదిద్దగలదు—...." అన్నాడు సీతాపతి.

అందులోని నిజం కృష్ణమోహన్‌కు తెలుసు.

రమాపతి, సీతాపతి అన్నదమ్ములు. కృష్ణమోహన్ కుటుంబాని కెంతో నమ్మకస్థులు వారు. అన్నివిధాలా సర్వసమర్థులు. కానీ కృతజ్ఞతకు కట్టుబడి కృష్ణమోహన్‌కి బానిసలు.

కృష్ణమోహన్‌కి బానిసత్వం గిట్టదు.

కృతజ్ఞతో, రక్త సంబంధమో — బానిసత్వానికి ప్రోత్సహించడం మన సంప్రదాయం. యుధిష్ఠిరుడి తమ్ములు అన్నకు బానిసలయినా—వారి సమర్థతకు గుర్తింపు, వ్యక్తిత్వాలకు గౌరవం తక్కువ కాలేదు.

రమాపతి సీతాపతి తాము యుధిష్ఠిరుని తమ్ముల ఒరవడిలో నడుచుకుంటున్నట్లు కృష్ణమోహన్‌కు చెప్పారు.

ఇద్దరూ వేర్వేరు నగరాల్లో కృష్ణమోహన్ వ్యాపార వ్యవహారాలు చూస్తున్నారు.

కృష్ణమోహన్ పెద్దగా శ్రమపడడు. అతడప్పుడప్పుడు

పెద్ద వ్యవహారాలు చూస్తాడు. జీవితంలో సుఖపడతాడు. రమాపతి, సీతాపతి తమ తమ జీవితాలను వ్యాపారానికే అంకితం చేశారు. వచ్చిన లాభాలలో పావలా వాటాతో తృప్తిపడతారు—మిగతా దంతా కృష్ణమోహన్ ది.

కృష్ణమోహన్ కి వివాహమై నాలుగు సంవత్సరాలయింది.

చాలామందికి కృష్ణమోహన్ కున్న వేర్వేరు నగరాల వ్యాపారం గురించి తెలియదు. అందరూ అనుకునేది కృష్ణమోహన్ వ్యాపార వ్యవహారాలు రమాపతి చూస్తున్నాడని! సీతాపతి గురించి ఎందరికో తెలియదు. వివాహమైన నాలుగు సంవత్సరాల కింకా అతడి భార్యకూ యీ విషయం తెలియదు.

"విశేషాలు చెప్పండి సార్—...." అన్నాడు సీతాపతి.

"నువ్వీ యింట్లో వుండడం లేదా?" అన్నాడు కృష్ణమోహన్.

"మీ దయవల్ల నేనీ యింట్లో వుండనవసరం లేను. వేరే స్వంతిల్లు కట్టుకున్నాను...." అన్నాడు సీతాపతి.

"ఇందులో నా దయేముంది? పదేళ్ళుగా వ్యాపార వ్యవహారాలన్నీ నువ్వే చూస్తున్నావు. చిన్న వ్యాపారాన్ని స్థాయికి తెచ్చావు—" అన్నాడు కృష్ణమోహన్.

"ఆధారం చూపింది మీరు—" అన్నాడు సీతాపతి వినయంగా.

కృష్ణమోహన్ తన అదృష్టాన్ని తనే అభినందించుకున్నాడు.

లంచం తీసుకున్నాడన్న నేరంమీద ఉద్యోగం

పోగొట్టుకొని సంసారాన్ని నడివీధిపాలు చేశాడు చలపతి. ఆ చలపతి కాశ్రయమిచ్చి దారి చూపించాడు విశ్వమోహన్.

కృష్ణమోహన్ విశ్వమోహన్ కొడుకు.

రమాపతి, సీతాపతి—చలపతి బిడ్డలు. చిన్నతనం నుండీ చలపతి తన బిడ్డలకు కృతజ్ఞతను నూరిపోశాడు.

ఫలితంగా కృష్ణమోహన్ సుఖపడుతున్నాడు.

“విశేషాలు చెప్పండి సార్....” అన్నాడు సీతాపతి.

“ముఖ్య విశేషం—బహుశా నేనిక్కడే ఉండి పోతాను....”

“అంటే?”

“అక్కడి వారికి సీతాపతి తెలియదు. ఇక్కడి వారికి రమాపతి తెలియదు. ఇంతకాలం నేను రమాపతికి యజమాని. ఇప్పుడు నేను నీ యజమానిని....”

“మరి అమ్మగారు?”

“అమ్మగారక్కడే ఉంటారు....”

సీతాపతి ఆశ్చర్యంగా — “అమ్మగారక్కడుంటే మీరిక్కడెలాగుంటారు?” అన్నాడు.

“అది నీకు చెప్పను. నువ్వు అడక్కూడదు—” అన్నాడు కృష్ణమోహన్.

భార్య అతడి కళ్ళముందు మెదిలింది.

సూర్యప్రభ ఆమె పేరు. పేరుకు తగ్గట్టే సూర్య తేజంతో వెలిగిపోతుందామె.

“ప్రభా! భయంకరమైన జబ్బు నన్నావహించింది. ఈ దేశంలో దీనికి వైద్యం లేదు. నా జబ్బు గురించి ఎవరికీ తెలియడం నా కిష్టంలేదు. అందుకే రహస్యంగా వెడుతున్నాను. వ్యాపార వ్యవహారాలన్నీ రమాపతి

చూస్తూంటాడు. అప్పటిదాకా నానుంచి నీకే సమాచారమూ అందదు. ఆ తర్వాత నేను బ్రతికేదీ లేనిదీ తెలుస్తుంది—...." అని ఆమె దగ్గర వీడ్కోలు తీసుకున్నాడు కృష్ణమోహన్.

భర్త తనను విడిచి వెడుతున్నాడని ఆమెకు తెలియదు.

"కొంతైనా నాకు చెప్పండి-" అన్నాడు సీతాపతి.

"నే నిక ఇక్కడే ఉండిపోతాను. ఇక్కడ కొత్త జీవితం ప్రారంభిస్తాను. ఈ విషయం నీ అన్నకు తెలుసు. ఇంకెవ్వరికీ తెలియదు. నా భార్యకూడా!"

"మీ రామెను విడిచి పెట్టేస్తున్నారా?"

"ఆ విషయం నన్నేమీ అడగొద్దు...."

"పోనీ—ఇక్కడింకో పెళ్ళి చేసుకుంటారా?"

"నాకై నేను పెళ్ళిప్రయత్నాలేం చేయను. కానీ ఏ అమ్మాయైనా నాపై వల విసిరితే అది వేరే సంగతి...."

## 4

విశాలమైన పార్కులో రెండు గులాబుల మధ్య నిశ్శబ్దంగా కూర్చున్నాడతడు. అతడి చూపులదోరకంగా ఉన్నాయి.

అతడు మనుషుల్ని చూడ్డంలేదు, ప్రకృతినీ చూడ్డంలేదు.

తననే చూస్తున్న చంచలనీ చూడ్డంలేదు.

చంచల మాత్రం అతడినే చూస్తోంది. ఆ చూపులు వల ఆకారంలో అతడి చుట్టూ తిరుగుతున్నాయి.

ఆమె అతణ్ని నాలుగురోజులుగా గమనిస్తోంది.

అతడికి కారుంది. అతడికింద మనుషులున్నారు.

అతడు డబ్బున్నవాడనడంలో ఆమెకు సందేహం లేదు.

అతడి నడకలో, మాటలో, చూపులో సంస్కార ముట్టిపడుతోంది.

సంసారపక్షం భాగ్యవంతుడతడని ఆమె గ్రహించింది.

నాలుగు రోజుల్లో ఆమె అతడి గురించి చాలా సమాచారం సేకరించింది. అతడి పేరు కృష్ణమోహన్ అని తెలుసుకుంది.

ఈరోజామె అతణ్ని పలకరించాలనుకుంటోంది.

కానీ ఎదుట నిలబడ్డా అతడామెను చూడ్డంలేదు.

ఆమె అతణ్ని సమీపించి ఎదురుగా కూర్చుంది. అతడు కనీసం ఉలిక్కిపడనైనాలేదు.

అప్పుడామె అతడి కళ్ళలో లీలామాత్రంగా విషాదాన్ని చూసింది.

"హలో!" అందామె.

అతడులిక్కిపడి ఆమెను చూశాడు.

కళ్ళు చెదిరే అందం....మనసు చెదిరే రూపం....

"నా పేరు చంచల..." అందామె.

అతడు మాట్లాడకుండా ప్రశ్నార్థకంగా ఆమె వంక చూశాడు.

"నీతో స్నేహాన్ని కోరుతున్నాను—" అందామె.

"ఎందుకు?" అన్నాడతడప్రయత్నంగా.

"నువ్వు నన్ను పరీక్షగా చూడలేదు. చూస్తే నీ కళ్ళలోలాంటి విషాదమే నా కళ్ళలోనూ కనబడేది నీకు..." అందామె.

అతడు తడబడ్డాడు—"నా కళ్ళలో విషాదమా?"

"మనం—ఒకే గూటిపక్షులం—" అందామె.

"నా గురించి నీకేం తెలుసు?"

"నా కథ చెబుతాను విను. నీదీ అలాంటి కథే

అయుండాలి....'' అందామె.

అత డామె కథ వినడానికి సిద్ధపడ్డాడు.

"ఆడపిల్లకి దేశంలో విలువ, గౌరవం లేదు. అమ్మా, నాన్నా కష్టాల్లో ఉంటే అన్నయ్య ఆదుకోలేదు. నే నుద్యోగం సంపాదించి ఆదుకున్నాను. ఇప్పు డన్నయ్య కమ్మా నాన్నల అవసర మొచ్చింది. వాడు మగపిల్లవాడు కాబట్టి వాడిదగ్గరకు వెళ్ళిపోయారు. నేనాడపిల్లనని నన్ను వదిలేశారు. ఉద్యోగం పేరు చెప్పి బాగా నే నిల కేశాను. కానీ నాకు నా అన్నవాళ్ళు లేరు. ఓ చెల్లుంది. కానీ తనకంటూ ఓ ఆధారం ఏర్పడ్డానికే అది నాతో కలసి వుంది. తల్చుకుంటే నాకు చాలా బాధగా వుంటుంది'' అంది చంచల.

కృష్ణమోహన్ నిట్టూర్చి—"నీ కథలో నాకు విషాదం కనబడలేదు....'' అన్నాడు.

"నేను ఒంటరి ఆడదాన్ని. స్వంతిల్లుంది. ఎంతో కొంత డబ్బుంది. నాకు అందం, ఆకర్షణ వున్నాయని— చాలామంది అంటారు. నా చుట్టూ యెందరో మగాళ్ళు వలలు పన్నుతున్నారు. సాధారణంగా నా యీడు పిల్లలకి రక్షించే పెద్దలుంటారు. నన్ను నేనే కాపాడు కోవాలి. కాపాడుకోగలనో లేదో తెలియదు. ఏ క్షణంలో యే వలలో పడిపోతానోనని నాకు భయం గానూ, బెంగగానూ ఉంటోంది—....'' అంది చంచల.

"నీ బాధ నా కర్థమయిందిప్పుడు. వలకు సంబంధించి నంతవరకూ నీకూ నాకూ కొంత పోలిక వుంది. ఎటొచ్చీ వల గురించి భయపడుతున్నావు. నే నెదురుచూస్తు న్నాను....'' అన్నాడు కృష్ణమోహన్.

"అంటే?" అంది చంచల ఆశ్చర్యంగా.

"నేను మగాణ్ని. ధనవంతుణ్ని. ఒంటరిని. నాకో ఆడతోడవసర మనిపిస్తోంది. నాకై నేనే ప్రయత్నిస్తే యెందరో నాకు వశమవుతారు. నా కిష్టం లేదు. ఎందుకంటే నేను స్త్రీని తాత్కాలికావసరంగానే తప్ప బాధ్యతగా స్వీకరించదల్చుకోలేదు. నా సంస్కారం నన్ను స్త్రీని మోసగించడానికి ఒప్పుకోదు. అందుకే నాపై వల విసిరే స్త్రీ కోసం నేనెదురు చూస్తున్నాను. అప్పుడామె మోసపోయినా అది స్వయంకృతాపరాధమవుతుంది తప్ప—తప్పు నాదికాదు—" అన్నాడు కృష్ణమోహన్.

చంచల మరింత ఆశ్చర్యంగా—"నీ మాటలు నేను నమ్మలేను—" అంది.

"నమ్మడం నమ్మకపోవడం నీ ఇష్టం. నిజం చెప్పడం నా బాధ్యత...."

చంచల కతడు తన్ను హెచ్చరిస్తున్నాడని అర్థమయింది.

"నువ్వు నన్ను తప్పుగా అర్థం చేసుకున్నావు.... నేను కోరుతున్నది నీ స్నేహాన్ని. నేను నీపై వలను విసరాలనుకోవడం లేదు...."

"భుజాలు తడుముకోకు. నా అభిప్రాయంలో స్త్రీ పురుషుల మధ్య కేవలం స్నేహం సాధ్యపడదు. ఇలా పార్కులో మాట్లాడుకోవడం వేరు. మనమే గదిలోనో ఏకాంతంగా కలుసుకుంటే—స్నేహం ప్రణయంగా మారడాని కెంతో సేపు పట్టదు. అది సృష్టి విశేషం...."

"నువ్వు చాలా ఫ్రాంక్‌గా మాట్లాడుతున్నావు...."

అంది చంచల.

"నా తీరే అంత! నా పేరున పెద్ద వ్యాపారమే నడుస్తోంది. కానీ నేను అనామకుణ్ణి. నా సంస్థలో నేను కనపడను. మీటింగులకి నేను వెళ్ళను. ఊళ్ళో చాలా మందికి నేను తెలియను. వ్యక్తిగత జీవితమంటే నా కెంతో యిష్టం. ఒకరి ప్రమేయం లేకుండా, డబ్బు కిబ్బంది లేకుండా అలా బ్రతికే అవకాశం నా కొచ్చింది. నా వ్యవహారం చూసే మనుషుల్ని నేను పూర్తిగా నమ్ముతున్నాను. ఏ విషయంలోనూ వారిని ప్రశ్నించకుండా వారికి పూర్తి స్వాతంత్ర్య మిచ్చాను. అందుకు వారు నా పట్ల కృతజ్ఞులు. వారిపై నే నథార్టీ చేయను. వారు నే నంటే భయంగా వుంటారు. నా సిరిసంపదలు, వైభోగం- వారి కారణంగా నే నని నాకు తెలుసు. ఆ విషయం నేను వారికి చెబుతాను. ఏ రోజునైనా వారు నన్ను మోసం చేస్తే బాధపడను. నా కున్నది నాకు చాలు...."

"చాలా విచిత్రమైన మనిషివి నీవు...." అంది చంచల.

"పిలవకుండా నాతో వచ్చి మాట్లాడిన అందమైన యువతికి నా గురించి ఈ మాత్రం చెప్పాలనుకున్నాను" అన్నాడు కృష్ణమోహన్.

"నీ గురించి చాలా చెప్పావు. థాంక్స్. కానీ నువ్వు పెళ్ళెందుకు చేసుకోవు?"

"ముందే చెప్పాను నీకు. నేను వ్యక్తిగత జీవితాన్ని చాలా యెక్కువగా ప్రేమిస్తాను. వివాహం చేసుకుంటే భార్య ఆ వ్యక్తిగత జీవితంలో ఒక భాగమవుతుంది. అందుకు నా కభ్యంతరం లేదు. కానీ అప్పుడామె

పూర్తిగా నాకే చెందాలి. నన్ను ప్రేమించాలి. నా గురించే ఆలోచించాలి. నా శరీరంలో భాగమై పోవాలి...."

"నీ భార్య కూడా నీ గురించలాగే అనుకుంటే...."

"అనుకోవాలని నా కోరిక.... నేను నా భార్య కివ్వ గలిగినదే నేనామె నుంచి కోరుకుంటాను...." అన్నాడు కృష్ణమోహన్.

"యూ ఆర్ గ్రేట్...." అంది చంచల.

"థాంక్స్ ఫర్ యువర్ కాంప్లిమెంట్! కానీ నా అభిమతాన్ని ఏ భార్యా మెచ్చుకుంటుందనుకోను...."

"ఎందుకని?"

"ఆడవాళ్ల మనస్తత్వం వేరు. వాళ్ళు స్వార్థపరులు. నలుగురిలో తమకో ఉన్నత స్థానం కావాలని— వారెన్ని త్యాగాలైనా చేస్తారు. భర్తను కాక అతడి హోదానూ, తద్వారా తమకు వచ్చే హోదాను ప్రేమిస్తారు. భర్త యెంతగా అభినందించినా, సంతోషించినా వారికి తృప్తి ఉండదు. తమ సౌందర్యానికి, ఉనికికి లోకంలో గుర్తింపు లభించాలి. ఆ గుర్తింపు కోసమే వారి తాపత్రయం. ఫలానా ఆమె చీర బాగా కడుతుంది, చక్కగా అలంకరించుకుంటుంది, తీయగా మాట్లాడుతుంది, అద్భుతంగా వంటలు చేస్తుంది—అని లోకం మెచ్చుకోవాలి. అందుకే వారు తాపత్రయపడతారు. నాకది నచ్చదు...."

"అయితే?"

"నాకితరులతో పనిలేదు. నా భార్యకోసం జీవిస్తాను. నా భార్య కూడా అలాగే నా కోసం జీవించాలనుకుంటాను...."

"నీవు, స్త్రీల గురించి యెవరో తప్పుగా చెప్పారు. సాధారణంగా యే స్త్రీ అయినా భర్త కోసమే జీవించా లనుకుంటుంది. పురుషుడు భార్యకంటే ఎక్కువగా బయటి ప్రపంచాన్ని ప్రేమిస్తాడు.... భర్త నీవలా ఉంటే ఏ భార్యయినా యెంతో సంతోషిస్తుంది...." అంది.

కృష్ణమోహన్ నవ్వాడు. తనకు వివాహమయిందని చెప్పలేదు.

"అవకాశం లభిస్తే నేను నీ దురభిప్రాయాలను తొల గించగలను—" అంది చంచల మళ్ళీ.

"నీకా అవకాశం రాదు. నేను వివాహం చేసుకోనని ప్రతిజ్ఞ పట్టాను...." అన్నాడు కృష్ణమోహన్.

"జీవితాంతం పెళ్ళి చేసుకోకుండా వుండిపోతావా?" అంది చంచల. ఆశ్చర్యమామె కళ్ళలో స్పష్టంగా కన బడుతోంది.

"అవును—....తప్పనిసరి పరిస్థితులెదురైతే తప్ప...."

"తప్పనిసరి పరిస్థితులంటే....?"

"పెళ్ళి చేసుకోనంత మాత్రాన స్త్రీ ఆకర్షణనుంచి నేను తప్పించుకోగలననుకోను. అలాంటప్పుడే స్త్రీ అయినా నా కారణంగా తల్లి అయితే—ఆమెపట్ల నాకు కొంత బాధ్యత ఉంటుంది. ఆ బాధ్యతను డబ్బుతో తీర్చుకోగలిగితే ఫరవాలేదు. కానీ ఒకోసారి తప్పనిసరి పరిస్థితి ఏర్పడవచ్చు...."

చంచల కతడి ఉద్దేశ్య మర్థమయింది. అతడు తనను ప్రోత్సహిస్తున్నాడు. అదృష్టాన్ని పరీక్షించుకోమంటు న్నాడు. ప్రతిఫలంగా డబ్బివ్వగలనని సూచిస్తున్నాడు. తప్పనిసరయితే వివాహం చేసుకోగలనని ఆశ పెడు

తున్నాడు.

"నీపై నా గౌరవం పెరిగింది. మనిద్దరివీ ఒకేరకం భావాలు. మనం కేవలం స్నేహంగా వుందాం—...." అంది చంచల.

## 5

మొదట్లో కొన్ని రోజులు చంచల, కృష్ణమోహన్ పార్కులో కలుసుకునేవారు. తర్వాత ఆమె అతణ్ని తనింటికి ఆహ్వానించింది.

ఇద్దరూ చనువుగా ఎన్నో మాట్లాడుకునేవారు. కానీ దూరం మెయింటైన్ చేసేవారు.

ఒకరోజున కృష్ణమోహన్ పార్కులో ఆమెతో—
"మన స్నేహం అపూర్వమైనది. ఇంతకాలం స్నేహంలో కూడా మనమింకా దూరంగా ఉండగలుతున్నామంటే- మనకు పరస్పరం మంచి స్నేహభావం, గౌరవమున్నా యనుకోవాలి. లేదా మన మిద్దరం మహోన్నతులమై ఉండాలి. లేదా — మనకు పరస్పరాకర్షణ లేదనుకోవాలి—...." అన్నాడు.

"మూడోది నిజం కాదు—" అంది చంచల.

"ఎలా చెప్పగలవు?"

"చాలా సింపుల్. మనమిద్దరం ఒకరిపై ఒకరు వల విసురుకుందుకు ప్రయత్నించడంలేదు...."

"అదే—ఎలా చెప్పగలవు?"

"ఆడది తల్చుకుంటే మగాణ్ని అతిసులభంగా వల పన్నుకోగలదు. మగాడు ప్రయత్నిస్తే ఆడదాన్ని సులభంగానే తన దారికి మళ్ళించుకోగలడు. నువ్వూ నేనూ పరస్పర స్నేహాన్ని మాత్రమే అభిలషిస్తున్నాం...."

"నీ మాటలు నిజంకాదు....తల్చుకున్నా నీవు నన్ను

గళపద్ధతిలో లేవు....”

"శాపాలంటే బుజువు చేయగలను....”

"ఇది నా వ్యక్తిత్వానికే సవాల్ ..”

"ఈ సవాలులో నేనోడితే నీ వ్యక్తిత్వం నిలబడవచ్చు. కానీ నీ వోడినా గెలుపు నీదే—అప్పుడు నా జీవితం సంగ తేమిటి?”

"నా కారణంగా ఎవరి జీవితమూ నాశనం కాదు..” అన్నాడు కృష్ణమోహన్.

చంచల నవ్వి—"నేను నిన్ను నమ్ముతున్నాను—” అంది. ఆ నవ్వు యెప్పటిలాకాక కొత్త రకంగా మనోహరంగా వుంది.

అప్పుడే యిద్దరూ పార్కులోంచి లేచారు.

చంచల అతణ్ని తనింటికి డిన్నరు కాహ్వానించింది.

ఇంట్లో సుభద్ర లేదు. ఆమె సెలవు పెట్టి తలిదండ్రుల వద్దకు వెళ్ళింది.

ఇంట్లో సదుపాయాలు బాగున్నాయి.

ముందు చంచల వంట చేసింది. ఆ సమయంలో కృష్ణమోహన్ పేపరు చదువుతున్నాడు.

వంటయ్యాక ఆమె కృష్ణమోహన్‌ని స్నానం చేసి రమ్మంది. అతడి కోసం రాత్రి బట్టలు కూడా సిద్ధంగా ఉంచింది.

"ఇవెక్కడివి?” అన్నాడాశ్చర్యంగా.

"మా నాన్న, అన్న....ఇక్కడికి వచ్చినపుడు కట్టుకుంటారు....”

కృష్ణమోహన్ స్నానం చేసి వచ్చాడు.

తర్వాత చంచల తనూ స్నానం చేసి వచ్చింది.

ఇద్దరూ భోంచేశారు.

"వంట అద్భుతం—...." అన్నాడు కృష్ణమోహన్.

"అది అభిమానం...." అంది చంచల.

"ఇక నేను సెలవు తీసుకుంటాను...." అన్నాడు కృష్ణమోహన్.

"అప్పుడేనా" అంటూ అదోరకంగా పళ్ళు విరుచుకుంది చంచల.

ఆ విరుపులో ఆమె యొక్క పెట్టిన మన్మథబాణంలా మారింది.

కృష్ణమోహన్ చూపులామె శరీరంలో చిక్కబడిపోయాయి.

అతడక్కడే ఆగిపోయాడు.

చంచల నవ్వింది.

ఆ నవ్వులో పిలుపుంది. మత్తుంది.

కృష్ణమోహన్ ఆమెవైపుగా నడిచాడు.

చంచల శరీరంనుండి మైమరపించే పరిమళం....

కృష్ణమోహన్ ఆమెకు దగ్గరయ్యాడు.

## 6

"నువ్వే గెలిచావు—" అన్నాడు కృష్ణమోహన్.

"కానీ నేనోడిపోయాను—" అంది చంచల.

"అదెలా సాధ్యం?"

"నిన్ను రెచ్చగొట్టాలనుకున్నాను. కానీ నీకు లొంగిపోవాలనుకోలేదు. నీ గొప్పతనం నన్ను నీకు దాసోహమనిపించింది. నీ వ్యక్తిత్వం నన్ను నేను మరిచిపోయేలా చేసింది...." అంది చంచల.

కృష్ణమోహన్ కళ్ళు మూసుకున్నాడు. అతడి మనసు తీవ్రాలోచనలో వుంది. అతడి ముఖంలో సంతోషం ప్రతిఫలించడం లేదు.

ఆ తర్వాత ఇద్దరూ ఎన్నోసార్లు కలుసుకున్నారు. సన్నిహితంగా మసిలారు.

ఒకరోజున చంచల అతడితో — "మన వివాహ మెప్పుడు?" అంది.

"వివాహమా? అలాగని నీకు వాగ్దానం చేశానా?" అన్నాడు కృష్ణమోహన్ తాపీగా.

"లేదు. కానీ...." అని ఆగింది చంచల.

"ఊఁ.... కానీ...."

"నేనిప్పుడు తల్లిని కాబోతున్నాను...."

పక్కలో బాంబుపడ్డట్టు ఉలిక్కిపడ్డాడు కృష్ణ మోహన్.

"అదేమిటలా ఉలిక్కిపడ్డావు?" అంది చంచల.

"నువ్వు చెప్పింది—అసాధ్యం...."

"ఎందుకని?'

కృష్ణమోహన్ తన చొక్కా జేబులోంచి ఓ టాబ్లెట్ తీసి చంచలకు చూపిస్తూ—"ఇది కుటుంబ నియంత్రణకు మగవారి టాబ్లెట్. నూటికి నూరుపాళ్ళు సక్సెస్ గ్యారంటీ—" అన్నాడు.

"అయితే?"

"నేనిది వాడుతున్నాను...."

చంచల అదోలా అతడి వంక చూసి—"అయితే డాక్టరబద్ధం చెప్పాడంటావా?" అంది.

"అయుండవచ్చు...."

"అబద్ధం చెప్పాల్సిన అవసర మేముందా డాక్టరుకి."

"ఎందుకైనా మంచిది—మరో డాక్టర్ని చూడు."

"కొన్ని విశేషాలు డాక్టరు చెప్పకుండానే ఆడ వాళ్ళకు తెలుస్తాయి...."

కృష్ణమోహన్ చటుక్కున — నిజం "చెప్పావు —" అన్నాడు.

చంచల ఉలిక్కిపడి — "అంటే?" అంది.

"బిడ్డకు తండ్రి ఎవరో తల్లికే తెలుస్తుంది. డాక్టరుకీ కాదు. మగాడికీ కాదు. ప్రియుడికీ కాదు ...." అన్నాడు కృష్ణమోహన్ గంభీరంగా.

"ఏమన్నావ్?" అంది చంచల.

"మిస్ చంచలా! నేను తెలివి తక్కువవాణ్ని కాదు. మన స్నేహం మనని దగ్గర చేసింది. నా నిగ్రహాన్ని ఓడించింది. అంతటితో తృప్తినొంది ఊరుకోవాలి నువ్వు. అత్యాశకు పోకు ...." అన్నాడు కృష్ణమోహన్.

"నాది ఆశ కాదు. అనుబంధం ...."

"అనుబంధంలో మోసాలుండవు ...."

"నిజం చెప్పావు ...." అంది చంచల.

"అంటే?" అన్నాడు కృష్ణమోహన్. కానీ ఆమె చెప్పబోయేది అతడికి తెలుసు.

"నీవు వ్యాపారస్థుడివి. అనుబంధాలను మోసానికుపయోగించడం నీ వృత్తి. నేను నీ వ్యక్తిత్వాన్ని నమ్మాను. నా నమ్మకాన్ని మోసం చేయకు ...." అంది చంచల.

"డాక్టరు చేత మరోసారి పరీక్ష చేయించుకో. నీవు గర్భవతివి కావని తెలుస్తుంది. అవునని తేలిందనుకో — అప్పుడు నాకు నీ ప్రియుడెవరో చెప్పు. మీ యిద్దరికీ నేనే దగ్గరుండి పెళ్ళిచేయిస్తాను ...." అన్నాడు కృష్ణమోహన్.

"ఆ టాబ్లెట్లోసారి యివ్వు —" అంది చంచల.

"ఎందుకు?"

"చెబుతాను, ముందిలాగివ్వు ...."

అతడా టాబ్లెట్టు ఆమెకిచ్చాడు.

చంచల దాన్ని పరీక్షించి చూసింది.

పసుపుపచ్చ రంగులో గుండ్రంగా వుందా టాబ్లెట్. దానిపై యే పేరూ లేదు.

"ఏం తెలిసింది నీకు?" అన్నాడు కృష్ణమోహన్.

"మోసపోయానని...." అంది చంచల.

"నీవు మోసపోయుండవచ్చు. కానీ నిన్నెవ్వరూ మోసగించారనుకోను...."

"ఈ టాబ్లెట్ నువ్వు రోజూ వేసుకుంటావా?"

"అవును. ఏ స్త్రీకీ నా కారణంగా మాతృత్వ బాధ్యత రాకూడదని నా అభిమతం...."

"నా ప్రియుడుకూడా అదే పని చేస్తున్నాడు. అతడూ రోజూ ఈ టాబ్లెట్ వేసుకుంటాడని నాకు తెలుసు...." అంది చంచల.

కృష్ణమోహన్ ఆమె వంక అదోలా చూసి— "మొత్తంమీద నీకు వేరే ప్రియుడున్నాడని ఒప్పుకున్నావు. సంతోషం—" అన్నాడు.

"నాకూ సంతోషంగానే వుంది. నీ టాబ్లెట్ పని చేయకపోయే అవకాశముందని నువ్వూ ఒప్పుకున్నావు.." అంది చంచల.

"నేనొప్పుకోలేదు—" అందామనుకుని ఆగిపోయాడు కృష్ణమోహన్. చంచల చాలా తెలివిగా మాట్లాడుతోందని అతడికర్థమయింది.

"ఒప్పుకున్నావు కాబట్టి—నాకు వేరే ప్రియుడు లేడు. నువ్వే నా ప్రియుడివి. కాబోయే భర్తవు...." అంది చంచల.

"పగటి కలలు కనవద్దు—" అంటూ లేచాడు కృష్ణ

మోహన్.

"సరే—రేపు నువ్వు నా యింటికి రావద్దు. మనం పార్కులో కలుసుకుందాం—" అంది చంచల.

# 7

చంచల పార్కుకి వెళ్ళే సమయానికి కృష్ణమోహన్ అక్కడ ఆమెకోసం యెదురుచూస్తున్నాడు. ఆమె చాలా సంతోషంగా—"నువ్వు రావనుకున్నాను—" అంది.

"నీ ఆకర్షణ నీ ఆరోపణలకంటె గొప్పది—" అన్నాడతడు.

"థాంక్స్ ఫర్ ది కాంప్లిమెంట్.... నేనిప్పుడు మరో ఆరోపణ చేయడానికి ధైర్యాన్నిచ్చావు...." అంది చంచల.

"ఏమిటది?" అన్నాడు కృష్ణమూర్తి కుతూహలంగా.

"నీవిచ్చిన టాబ్లెట్ డాక్టరుకిచ్చాను...."

"ఎందుకు?"

"కుటుంబనియంత్రణకు మాత్రలు మగవారు వాడేవి మనదేశంలో లేవని డాక్టరు కచ్చితంగా చెప్పాడు. ఆయనకు నీ టాబ్లెట్ చూపించాను. దాన్ని పరీక్షించి—అది విటమిన్ సీ టాబ్లెట్టని తేల్చాడాయన...."

"ఇంపాసిబుల్...."

"నీకా టాబ్లెట్లెవరిచ్చారో చెప్పు. కేసు ఫైలు చేద్దాం."

"అవసరంలేదు. నాకా టాబ్లెట్లమీద నమ్మకం వుంది. నీ డాక్టరుమీద నమ్మకం లేదు." అన్నాడతడు.

"మిస్టర్ కృష్ణమోహన్....నువ్వు నన్ను మోసం చేయాలనుకుంటున్నావు. ఆ విషయం సూటిగా అంగీకరించు. నిన్ను వదిలి వెళ్ళిపోతాను. నాతో యిలా

డోంక తిరుగుడుగా మాట్లాడాల్సిన అవసరంలేదు. నేనందరి లాంటి ఆడదాన్ని కాదు—" అంది చంచల.

"లోపం నాది కాదు. నీది. నేనూ అందరిలాంటి మగాణ్ని కాదు." అన్నాడు కృష్ణమోహన్.

ఇద్దరూ కాసేపొకరివైపొకరు చూసుకున్నారు. ఆ చూపుల్లో ఒకరి బలాన్నొకరంచనా వేసుకున్నట్లు కనబడుతోంది.

"నీ టాబ్లెట్ పని చేయడంలేదని నా నమ్మకం. నువ్వు నా డాక్టర్ని నమ్మి పరీక్ష చేయించుకోవాలి...." అంది చంచల.

"పరీక్షకు నేను సిద్ధమే!" అన్నాడు కృష్ణమోహన్.

మర్నాడే చంచల కృష్ణమోహన్ని డాక్టర్ రెడ్డికి పరిచయం చేసింది. డాక్టరతడికి జరపాల్సిన పరీక్షలు జరిపి—"నీ శరీరం అన్నివిధాలా ఆరోగ్యంగా వుంది. నిన్ను వివాహం చేసుకున్న యువతి సంతానవతి కాకపోతే ఆ లోపం ఆ యువతిదే కానీ నీది కాకూడదు—" అన్నాడు.

కృష్ణమోహన్ మాట్లాడకుండా బైటకు వచ్చేశాడు. టాబ్లెట్స్ గురించి అతడు డాక్టరుతో మాట్లాడలేదు. ఎందుకంటే ఆ విషయంలో తను చెప్పిందబద్ధమని అతడికి తెలుసు.

చంచల మళ్ళీ అతణ్ని పార్కులో కలుసుకుందా సాయంత్రం. అతడామెను చూస్తూనే—"నీ డాక్టర్ రెడ్డి గురించి చాలా చెడ్డగా విన్నాను—" అన్నాడు.

"ఏమని?"

"డబ్బు కక్కుర్తి వున్నవాడని...."

"అయితే నువ్వే పరీక్షించలేకపోయావా?"

"ఎలా?"

"నా కంటే నువ్వు బాగా డబ్బిచ్చి చూసి కక్కుర్తి పడతాడో లేడో చూడాల్సింది — ...." అంది చంచల.

అతడు మాట్లాడలేదు.

"డాక్టర్ రెడ్డికి డబ్బు కక్కుర్తి వుందని నీ కెవరు చెప్పారో చెప్పు, అతడి ఎదుటే నిలదీసి అడుగుతాను" అంది చంచల.

"ఒక విషయం చెప్పనా?"

"ఊఁ!"

"నీవు నిజంగా గర్భవతివి కావు?...."

చంచల తెల్లబోయి—"ఎవరు చెప్పారు నీకు?" అంది.

"డాక్టర్ రెడ్డి నా విషయంలో తప్పినపుడు నీ విషయంలో తప్పడా?" అన్నాడు కృష్ణమోహన్ నవ్వుతూ.

"నా విషయంలో తప్పాడని ఋజువేమిటి?" అంది చంచల.

"చాలా పెద్ద ఋజువుంది—...." అన్నాడు కృష్ణ మోహన్.

"ఏమిటది?"

అతడు జేబులోంచి ఓ కాగితం తీసి చంచల చేతిలో పెట్టాడు.

చంచల ఆ కాగితాన్ని పరిశీలించి చూసింది.

అదో ఫోటో కాపీ!

డాక్టర్ సుదర్శన్ కృష్ణమోహన్‌ని పరీక్షించిచ్చిన

రిపోర్టది. రిపోర్టు ప్రకారం కృష్ణమోహన్‌కి సంతాన యోగ్యత లేదు.

"రిపోర్టుమీద తేదీ చూడు...." అన్నాడు కృష్ణమోహన్.

సుమారు మూడేళ్ళ క్రితం రిపోర్టది.

"తేదీ ప్రసక్తి ఎందుకిప్పుడు?"

"ఈ రిపోర్టు కారణంగానే నేను పెళ్ళికి విముఖుడి నయ్యాను. మూడు సంవత్సరాలుగా విచ్చలవిడిగా తిరుగుతున్నాను. సంతానార్హత లేనప్పుడు వివాహం చేసుకోవడమెందుకు? భార్య అనే గుదిబండను మెడకు తగిలించుకోవడ మెందుకు?" అగాడతడు.

"భార్య గుదిబండ కాదు. జీవితానికో తోడు. అద్భుతమైన తోడు. ప్రియురాలికీ భార్యకూ తేడా వుంటుంది. ఆ తేడా వివాహమైతే గానీ తెలియదు...."

"మిస్ చంచలా! స్త్రీ పురుషుల వివాహబంధాన్ని పటిష్టం చేసేది సంతానం. ఆ సంతానం లేకపోతే— వారిద్దరూ ఎవరికివారే అన్నట్లుంటారు...."

"ఎవరి అభిప్రాయం వారిది!" అంది చంచల.

"బాగా చెప్పావు. మూడేళ్ళుగా విచ్చలవిడిగా తిరుగుతున్నాను. ఈరోజు నువ్వబద్ధం చెప్పేదాకా— డాక్టర్ సుదర్శన్ రిపోర్టబద్ధం కాలేదు...."

చంచల తన వానిటీ బ్యాగ్‌లోంచి ఓ కాగితం తీసి దానిపై బాల్ పెన్నుతో—నోట్ చేసుకుంది డాక్టర్ సుదర్శన్ అడ్రసు.

"ఏం చేస్తున్నావు....?" అన్నాడు కృష్ణమోహన్.

"నువ్వు చాలా తెలివైనవాడివి. నన్ను మోసం చేయాలని డాక్టర్ సుదర్శన్ రిపోర్టును సృష్టించావు. డాక్టర్

రెడ్డి సామాన్యుడు కాడు. డాక్టర్ సుదర్శన్ అనేవాడంటూ వుంటే — అతడి మోసాన్ని బయట పెడతాను" అంది చంచల.

కృష్ణమోహన్ నవ్వి ఊరుకున్నాడు.

# 8

నర్సింగ్ హోంలో — ఓ గదిలో —

డాక్టర్ రెడ్డి — ఆయనెదుట చంచల — యిద్దరే కూర్చున్నారు.

"డాక్టర్ — మీరు నన్ను మోసం చేశారు...." అంది చంచల.

"ఎలా?"

"నా గర్భం అబద్ధమని కృష్ణమోహన్‌కు చెప్పేశారు...."

రెడ్డి నవ్వి — "ఎవరన్నారు?" అన్నాడు.

"కృష్ణమోహన్ ...."

"అయితే నీకతడు అబద్ధం చెప్పాడు...."

"అసలు మీ రిపోర్టే అబద్ధమని అతడంటున్నాడు. అందువల్ల నా గురించి మీరు చెప్పింది కూడా అతడు నమ్మడంలేదు...."

విషయం అర్థం చేసుకుందుకు రెడ్డికి కాస్సేపు పట్టింది. అప్పుడాయన-"మిస్ చంచలా! నీమీద నాకున్న ప్రత్యేకాభిమానంతో — నేను నీ పెళ్ళికి సహకరించాలనుకున్నాను. లేని గర్భాన్ని కల్పించి చెప్పాను. కానీ అతడి విషయంలో నే నిచ్చిన రిపోర్టు మాత్రం తప్పు కాదు...." అన్నాడు.

"మీపై నాకా నమ్మకముంది. కానీ ఈ రిపోర్టు సంగతేమిటి?"

డాక్టర్ రెడ్డి మిస్ చంచల అందించిన రిపోర్టందు కుని చూసి—"ఇది మూడేళ్ళ క్రితం రిపోర్టు—" అన్నాడు.

"రిపోర్టు ప్రకారం వైద్య పరీక్షలవల్ల కృష్ణ మోహన్ కి సంతాన యోగ్యత పుట్టదు, కాబట్టి మూడే ళ్ళలో అతడిలో మార్పు వచ్చిందనుకోవడానికి లేదు...."

డాక్టర్ రెడ్డి సాలోచనగా—"ఈ రిపోర్టు గురించి ఆరాతీసి మెడికల్ ప్రొఫెషన్లో నా నిజాయితీని నిలబెట్టు కుంటాను—" అన్నాడు.

"మీరు నిజాయితీ గురించి కాక నా గురించి ఆలో చించండి—" అంది చంచల భయంగా. ఆయన తన గురించిన నిజం కూడా కృష్ణమోహన్ కి చెప్పేస్తాడేమో నని ఆమె భయం.

"నీ భయం నా కర్థమయింది. ఒకరికి మంచి చేయడం కంటె నిజాయితీ నాకు ముఖ్యం కాదు—" అన్నాడు డాక్టర్ రెడ్డి.

## 9

పార్కులో ఓ సాయంత్రం—

చంచల, కృష్ణమోహన్—ఒకరికొకరు—ఎదురెదు రుగా....

"ఇక నేను నీ యింటికే వస్తాను. నీవు నా యింటికి రానక్కర్లేదు—...." అంది చంచల ఉత్సాహంగా.

"చాలా ఉత్సాహంగా కనబడుతున్నావు...." అన్నాడు కృష్ణమోహన్.

అతడికి తెలుసు—ఆమె తనపై వల విసురుతున్నదని! తానా వలలోంచి తప్పించుకోగలడనీ తెలుసు.... అతడి

నమ్మకం అతడిది.

"డాక్టర్ రెడ్డి సామాన్యుడు కాడు—...." అంది చంచల.

"ఊఁ!"

"ఆయన సుదర్శనాన్ని కలుసుకుని నిజం కక్కించారు...."

"ఏమిటా నిజం?"

"ఒకసారి నువ్వు చిన్న యాక్సిడెంట్‌లో ప్రమాదానికి గురై—ఓ నర్సింగ్ హోంలో చేరావు. అప్పుడు నీకు సుదర్శన్ వైద్యం చేశాడు...."

"అవును...."

"నువ్వో అమ్మాయిని ప్రేమించావు....అవునా?"

"నేను నిన్ను ప్రేమించలేదు...."

చంచల తడబడకుండా— "నా సంగతి కాదు. నీవు ప్రమాదానికి గురైనప్పుడు నువ్వో అమ్మాయిని ప్రేమించి ఉన్నావు.... అవునా?"

"అవునేమో—వినడానికి కుతూహలంగా ఉంది—చెప్పు...."

"ఆమెను మరో యువకుడు ప్రేమించాడు—...."

"ఊఁ!"

"అతడు డాక్టర్ సుదర్శన్‌కి స్నేహితుడు—...."

"అయితే?"

"నీకు డబ్బుంది. అతడికి లేదు. అందుకని ఆ అమ్మాయి నిన్నే ప్రేమిస్తోంది. నిన్నా వివాహానికి విముఖుణ్ణి చేయాలని ఆ యువకుడు డాక్టర్ సుదర్శన్‌కి డబ్బిచ్చాడు. ఫలితమే ఈ రిపోర్టు...."

కృష్ణమోహన్ ఆశ్చర్యంగా—"నువ్వు నిజమే చెబు

తున్నావా?" అన్నాడు.

"నీ విషయంలో—అడిగినా నా నోటివెంట అబద్ధం రాదు...."

చంచల, అతడు మళ్ళీ ఒకరినొకరు చూసుకున్నారు.

ఇద్దరూ ఒకరికొకరు సమ ఉజ్జీలు ...

అతడు టాబ్లెట్ వాడుతున్నా నన్నాడు.

ఆమె గర్భవతి నంది.

అతను తనకు సంతానయోగ్యత లేదన్నాడు. ఆమె ఉందంది.

ఆమె ఓ డాక్టరు రిపోర్టు తెచ్చింది. అతడింకొకటి తెచ్చాడు.

ఆ రిపోర్టుకామె ఓ కథ అంటగట్టింది.

"మిస్ చంచలా—మన మిద్దరం సమ ఉజ్జీలం...." అన్నాడతడు.

"ఇన్నాళ్ళకు గ్రహించావు—...." అంది చంచల సంతోషంగా.

"కానీ సమ ఉజ్జీలకు వివాహమైతే కలతలు రేగుతాయి...."

"ఎందుకని?"

"భార్యాభర్త లిద్దరూ సమమైన తెలివి కలిగి ఉండకూడదు. ఒకరికి తెలివివుండాలి. ఒకరు సామాన్యులు కావాలి. అప్పుడే వారు సర్దుకు పోగల్గుతారు...."

"మళ్ళీ కొత్త పాయింటు తేకు. నేను భరించలేను" అంది చంచల.

"నేను చెప్పింది కాదంటావా?"

"కాదనక ఔనంటాననుకున్నావా? ఆడదాని తెలివి

పెళ్ళయ్యేవరకే రాణిస్తుంది. పెళ్ళయ్యాక ఆమె తన భర్త చల్లనినీడలో బ్రతుకుతూ—అతడిని సుఖపెడుతూ—తన తెలివిని మరిచిపోతుంది. అందుకే తెలివైన ఆడవాళ్ల కాపురాలు కూడా వీధికెక్కడంలేదు...."

కృష్ణమోహన్ ఆలోచనగా—"ఏ విషయమూ నేను నీకు రేపు చెబుతాను...." అని ఆవేళ్టికామె దగ్గర సెలవు తీసుకున్నాడు.

# 10

మర్నాడు పార్కులో చంచల యెదురు చూస్తూండగా—

కృష్ణమోహన్‌కి బదులు మరో వ్యక్తి ఆమెను కలుసుకుని—

"నా పేరు సీతాపతి! కృష్ణమోహన్ మీకిది ఇమ్మన్నారు...." అంటూ ఓ బ్రీఫ్‌కేసు నామె కందించి—వెళ్ళిపోయాడు.

చంచల తెల్లబోయి బ్రీఫ్‌కేసు తెరిచి చూసింది. అందులో నోట్లకట్టలున్నాయి. మొత్తం లక్ష రూపాయలు....

ఆ నోట్లకట్టల అడుగున ఓకవరు....కవర్లో ఉత్తరం....

"డియర్ చంచలా!

నీ ఉపకారాన్ని నేను మరచిపోలేను. నేను నీకిస్తున్న డబ్బులో—నిన్ను విలువకట్టానని పొరబడకు. నీ జీవిత సహచరుణ్ని ఎన్నుకోవడంలో ఈ డబ్బు నీకు సాయపడాలని నా కోరిక.

డాక్టర్ సుదర్శన్ రిపోర్టును నేను నిజమని నమ్మాను. అయినా నేను ప్రేమించిన యువతికి నిజం చెప్పకుండా ఆమెను పెళ్ళి చేసు

కున్నాను. మా దాంపత్య ఫలించి ఆమె గర్భవతి అయితే ఆమె ననుమానించి విషయం చెప్పకుండా ఆమెను విడిచి వచ్చేశాను.

ఆమెను విడిచి నే నిక్కడ చేసిందేమిటని నీ వనుకోవచ్చు. నేను నా భార్య పట్ల యెలా వుంటానో— అంతకు మించి యేమీ ఆశించను. నే నామె నభిమానిస్తున్నప్పుడు ఆమె నాకు తెలియకుండా వేరెవరితోనో గడిపిందని కూడా నేను బాధపడలేదు. ఆ విషయం రహస్యంగా ఉంచినందుకు బాధపడ్డాను. ఆమె నన్ను మోసగించినట్లు ఫీలయ్యాను. ఆమెను వదలి పెట్టాను.

నాకు వివాహమైందన్న విషయంవిడిచి మిగతా నిజాలన్నీ ప్రత్యక్షంగానో పరోక్షంగానో నీకు చెప్పనే చెప్పాను. నీలో ఆశలు పెంచానని కూడా నే ననుకోను.

నా తప్పు గ్రహించాను. నాలో డాక్టర్ సుదర్శన్ వున్నాడన్న లోపం గురించి నా భార్యకు చెప్పకపోవడం కూడా నేను చేసిన పెద్ద తప్పుల్లో ఒకటి. నువ్వు నా చేత తప్పు చేయించి నాపై వల విసరాలనుకున్నావు. అది నాకు మరో విధంగా సాయపడి నా కాపురాన్ని నిలబెట్టింది.

ఒక గృహస్థు జీవితంలోకి ప్రవేశించి—అతడి నిబ్బంది పెట్టాలనుకునే సంస్కారం నీకు లేదు. నాకు సమ ఉజ్జీవైన నీవు — తగిన వరుడి నెన్నుకొని వివాహం చేసుకుని త్వరలో నే జీవితంలో స్థిరపడగలవని నమ్ముతున్నాను. నువ్వంటే

నాకూ భయం లేదనడానికి సూచనగా నా చిరు
నామా నీ కిక్కడ ఇస్తున్నాను.

నీకు నా ధన్యవాదాలు. కృతజ్ఞతలు.

నీ

కృష్ణమోహన్—"

ఉత్తరం చదివి చంచల భారంగా నిట్టూర్చింది. తన వల విఫలమైనా, కృష్ణమోహన్ తన్ను కాదన్నప్పటికీ- ఆమె కతడిపై కోపం రాలేదు.

"భర్త నెన్నుకునేందుకు వల విసరకూడదు! మరో పద్ధతి ననుసరించాలి—" అనుకున్నదామె.

—:అయిపోయింది:—